ఒక్కోసారి మనిషి సర్వస్వం పోయినా భరిస్తాడేమో కానీ, స్వాభిమానం దెబ్బతింటే సహించలేడేమో ?



# స్నేహం

వల్లంపాటి వెంకటసుబ్బయ్య

మధ్యాహ్నం నిద్ర లేవగానే పద్మ అంది.

"ఏమండీ మీ రెండో కార్యక్రమం యివాళ లేదా?"

గడియారం చూశాను. నాలుగ్గంటలు కావస్తోంది ... ఇప్పుడో అప్పుడో హనీఫ్ వచ్చేస్తాడు. నేనింకా యిప్పుడు నిద్ర లేస్తున్నాను....

అనుకుంటుండగానే వాడూ వచ్చాడు—మామూలుగానే-వీధి వాకిట్లోంచి అరుస్తూ.

"ఏం భాయ్ నిద్రలేచావా,లేదా ?అరే ! ఇంకా పరుపు మీదే ఉన్నావా? ఏం అదృష్టం భాయ్ ! ఏం పద్మమ్మా బాగున్నావా? మీ యింజనీరు ఎక్కడ భాయ్ ? ఏమయ్యా యింజనీరూ ?...." హనీఫ్ మావాడి కోసం గావుకేక పెట్టాడు.

"అబ్బాయి సినిమా కెళ్లాడన్నయ్యా." అంది పద్మ.

"అది వాడి ఆదివారం ప్రోగ్రాం .... లెయ్ లెయ్ లెయ్ భాయ్." అన్నాడు హనీఫ్ వాడి పెద్ద పిడికిలితో మంచంమీద బలంగా గుద్దుతూ .... నేను ముఖం కడుక్కొని వచ్చేసరికి పొగలుపోతున్న ఉప్మా ప్లేట్లు తయారుగా వున్నాయి.

"త్వరగా రా భాయ్. ఉప్మా చల్లారి పోతోంది ....పద్మమ్మా నెయ్యి పొయ్."

మళ్ళి ప్రారంభించాడు హనీఫ్.

వాడి తిండి మాటలకెప్పుడూ అడ్డం రాదు.

టిఫిన్ ముగించి వాడి మోటార్ సైకిల్ మీద బయల్దేరాం.

మోటార్ సైకిల్ మీద మద్రాస్‌వీధుల్లో హనీఫ్‌ను చూస్తే, చినుకూ చినుకూ మధ్య గుర్రాన్ని తోలిన పురాణ పురుషుడు జ్ఞాపకం వస్తాడు.

"మెల్లిగా పోనీరా" అన్నాను భయమేసి.

'ఆలస్యమైపోయింది. గురువు యెదురు చూస్తుంటాడు. నాలుగున్నరవుతోంది.' అంటూ వేగం హెచ్చించాడు.

మోటార్ సైకిల్ అకస్మాత్తుగా కోపం వచ్చిన పులిలా గుర్జిస్తూ ముందుకు దూకింది.

గురువంటే సత్యమూర్తి.

చిన్నతనంలోకూడా సత్యమూర్తి మాకు గురువే. చేలలో సెనక్కాయలు, కందికాయలు దొంగిలించటం, చీదళ్ళ చెంగయ్యతోటలో మామిడికాయలు మాయం చేయటం, నగరిబావిలో పూడు తేవడం, పీర్లు ఊరేగించేటప్పుడు వేషాలు వెయ్యడం, ములకలపున్నమికి పూలసంచులు కట్టడం.... నాటకాలేయడం, బీడీలు కాల్చడం మొదలైన ఎన్నిట్లోనో సత్యమూర్తి మాకు గురువు. సత్యమూర్తి నాకంటే మూడేళ్ళు పెద్ద, హనీఫ్ నాకంటే ఏడాది చిన్న.

సత్యమూర్తి మొదటినుంచీ సాహసవంతుడే.

ఊరికి మైలున్నర దూరంలో ఉన్న కొలిమి చింతమాను మాకు దయ్యాల కొంప. రాత్రిపూట అక్కడికి వెళ్ళిన మొదటివాడు సత్యమూర్తే. అమావాస్య రోజు సరిగ్గా రాత్రి పన్నెండు గంటలకు ఒంటరిగా వెళ్ళి కొలిమిచింత మానుమీద సున్నంతో తనపేరు రాసొచ్చాడు.

ఈ సంగతి విన్న మా ఊరు ఆశ్చర్య పోయింది.

మా ఊరి దొరవారి కొడుకు మా ఊరికి చిన్నదొర. పొగరు పుట్టి తరువాత వాడు పుట్టాడు. వాణ్ణి పేరుపెట్టి పిలిచే దమ్ము మా కెవరికీ వుండేది కాదు. మేము మదనపల్లి కాలేజీలో వుండేటప్పుడు వాడు నన్నేమో అన్నాడని చిత్తుగా తన్ని,

"మీ అబ్బతో చెప్పుకోపోరా పిల్లదొరా," అన్నాడు సత్యమూర్తి. వాడికి చెప్పుకునే ధైర్యం లేకపోయింది.

ఈ సంగతి తెలిసిన మా ఊరు మూర్ఛ పోయింది.

సత్యమూర్తి ఎక్కడున్నా అతనిది ప్రధాన పాత్రే. అతనికి హాకీ, నాటకాలూ రెండు కళ్ళలా వుండేవి. అతను గోల్ లోని బంతిని తీసుకుపోతుంటే మోడీ చేసినట్టుగా వుండేది. ఒకసారి ప్రిన్సిపల్ గారిని సత్యమూర్తి అనుకరిస్తే, వారు పరవశించిపోయి అతణ్ణి కౌగలించుకున్నారు. కాలేజీ వార్షికోత్సవంనాడు సగం బహుమతులు సత్యమూర్తికే వచ్చేవి.

కాలేజీలో ప్రారంభమైన సత్యమూర్తి నాటకాల పిచ్చి, శృతిమించి రాగానపడి, అతణ్ని మద్రాసు తీసుకుపోయింది. దాంతో అతని చదువు చూరెక్కింది.

నాలుగు సంవత్సరాలు మద్రాసులో ఎక్కడున్నాడో, ఏంచేశాడో, ఏంతిన్నాడో ఎవరికీ తెలీదు.

హఠాత్తుగా ఒక ప్రముఖ దర్శకుని చిత్రంలో ప్రముఖ పాత్రలో కనిపించాడు సత్యమూర్తి.

ఈసారి తెలుగు దేశమే ఆశ్చర్య పోయింది!

ఎంతో కాలానికి నటన రక్తంలోఉన్న నటుడు వచ్చాడని పత్రికలు సత్యమూర్తిని ఆకాశానికెత్తాయి.

అలా ప్రారంభమైంది సత్యమూర్తి సినిమా జీవితం.

తరువాత పదేళ్ళు దానికి అడ్డులేదు.

తెలుగుదేశం సత్యమూర్తి నవ్వితే నవ్వింది, ఏడిస్తే ఏడ్చింది.

సత్యమూర్తి తెలుగువాడికి నడవటం, మాట్లాట్టం చివరికి ప్రేమించటం నేర్పాడు.

"నువ్వు సినిమా నటుడివి కావటం ఛాన్సుకదూ?" అన్నానొకసారి.

"కానేకాదు. ఆనాడు నటనమీద అందరికీ గౌరవం వుండేది. నటనాశక్తి వున్నవాడు నటుడయ్యేవాడు.... ఆనాడు సినిమా ఒక కళ.... సినిమా తియ్యడం ఒక పవిత్ర యజ్ఞం. యూనిట్ అంతా ఒకే కుటుంబం" అన్నాడు సత్యమూర్తి.

నిజమే. సత్యమూర్తి మితాయిలు లేకుండా ఔట్ డోర్ షూటింగ్ ఉండేది కాదు. సత్యమూర్తి భార్య పార్వతమ్మ చేతి పులిహోర రుచి తెలియని డైరెక్టరూ లేడు.

ఆ విషయాలు నాకు హనీఫ్ చెప్పాడు. వాడు నాకంటే ముందు మద్రాసు చేరాడు. అప్పటికి నేను ఎమ్.ఎ. పూర్తిచేసి జీతాలురాని ఒక ప్రైవేటు కాలేజీలో పనిచేస్తుండే వాణ్ణి.

సత్యమూర్తి లక్షలు సంపాదించాడన్నారు అందరూ.

ఎంత మూట కట్టివుండకపోతే మావూరి హైస్కూలుకు పాతిక వేలిస్తాడన్నారు. మొదట నేనూ అలానే అనుకున్నాను. కానీ అందులోని నిజం నేను మద్రాసు కొచ్చి స్థిరపడ్డ తరువాత కానీ అర్థం కాలేదు.

నాకంటే ముందు మద్రాసు చేరుకున్న హనీఫ్ చిన్న లుంగీల వ్యాపారం ప్రారంభించి, పదేళ్ళలో పెద్ద వ్యాపారయ్యాడు. వాడూ, సత్యమూర్తీ బలవంతం చేస్తేనే మద్రాసు కొచ్చాను....

"ఏంది భాయ్ నువ్వు కూడా అలా అంటావు? గురువు చేతికి ఎముకలేదు. ఇలా సంపాదించి, అలా ఖర్చుచేస్తాడు," అన్నాడు హనీఫ్ చేతులు విసురుతూ.

"ఎలా?" అన్నాను.


"నేను చెప్పటం ఎందుకూ. ఇకమీదట నువ్వే చూసుకోవచ్చు" అన్నాడు వాడు.

చూశాను. చూసి భయపడ్డాను. ఒకసారి సత్యమూర్తితో ఆమాటే అన్నాను.

"ఏం, నేను ముసలితనంలో అన్నానికి లేకుండా చచ్చిపోతానేమోనని నీకు భయమా?" అన్నాడు, అసలే పెద్దవిగా ఉన్న కళ్ళు మరింత పెద్దవిచేస్తూ, చిలిపిగా నవ్వుతూ.

తత్తరపడిపోయాను — ఆ నవ్వు గుచ్చుకొని.

"అలా కాదు. కాస్త జాగ్రత్తగా ఉండటం తప్పుకాదుగా," అన్నాను.



"ఎవరికోసంరా జాగ్రత్త? నాకేం పిల్లా జల్లా లేపుగా! ఇక సంపాదనం టావా? నేను చచ్చేదాకా నటించగలను. సంపాదించగలను. అంతేకదూ పార్వతీ?" కాస్త గర్వంగా, పొడిగా నవ్వాడు సత్యమూర్తి.

పార్వతమ్మ జవాబు చెప్పలేదు. జవాబుగా నేతిగారెలు రెండు పళ్ళాలనిండా తీసుకొచ్చింది.

తిన్నాం.

సత్యమూర్తికి పెట్టటమేకానీ అడగటం తెలీదు

అతడు ఎవర్నీ ఏమీ అడగలేదు—చివరకి వేషాలుకూడా.

వేషాలు సత్యమూర్తిని ఎదుక్కుంటూ వచ్చేవి. వాటిని వెదుక్కుంటూ సత్యమూర్తి ఏనాడూ వెళ్ళలేదు

"పాత్రకోసం నటుడు పుడతాడ్రా. నటుడికోసం పాత్ర పుట్టదు." అనేవాడు. పరిశ్రమలోకి కొత్తగా వచ్చిన కొందరు నటులు వేషాలకోసం వేసే వేషాలుచూసి అసహ్యించుకునేవాడు.

"వీళ్ళకి కళాకారుడికుండాల్సిన ఆత్మగౌరవం లేదురా," అని బాధపడేవాడు. కానీ ఆత్మగౌరవం ఉండటం ఎంత ప్రమాదమో సత్యమూర్తి జీవితమే చెబుతుంది. కొత్తగావచ్చి, జొన్న కర్రగా ఎదిగిపోయిన ఒక నటుడు ఒకసారి తాగొచ్చి, సెట్ మీద చాలా అసభ్యంగా ప్రవర్తించాడట. అది భరించలేకపోయిన సత్యమూర్తి అతడికి కాస్త గట్టిగానే బుద్ధి చెప్పాడట. అంతే!

రెండో రోజే ఆ నటుడి కులానికి చెందిన నలుగురు ప్రొడ్యూసర్లు సత్యమూర్తి కాంట్రాక్టులు రద్దు చేశారట.

ఇది నాకు తెలిసేసరికి కాస్త ఆలస్యమైంది. ఇతరులు చెప్పలేదు. సత్యమూర్తికి చెప్పే స్వభావం లేదు.

నేను చెయ్యతగిన ప్రయత్నం నేనూ చేశాను. కానీ లాభంలేకపోయింది సత్యమూర్తిని తీసుకుంటే మేం పెట్టుబడి పెట్టమని చాలా మంది పంపిణీదార్లు చెబుతున్నట్లు తెలిసింది.

సత్యమూర్తి స్నేహితులు ఎవర్ని చూసో భయపడుతున్నట్టుగా కూడా తెలిసింది. కానీ యిదంతా కలలోని జ్ఞాపకంలా మంచుతెర వెనుక ముళ్ళపొదలా వుంది.

అలా ప్రారంభమైంది....

మోటార్ సైకిల్ సిమెంటురోడ్డు దిగి, ఎగిరెగిరి పడుతూ, చిన్న చిన్న మిద్దెలు, పెంకుటిళ్ళు దాటుకొని పరుగెడుతోంది. మిద్దెలకు, పెంకుటిళ్ళకు మధ్య పరచుకున్న గుడిసెలమీద సూర్యుడు పాలిపోతున్నాడు.



"భాయ్ ఈ రోజు నీ షేరెంత?" ప్రశ్నించాడు హనీఫ్.

"పాతిక. చాలా?"

"చాలు. నాది యాభై. చాలా?" మళ్ళీ అడిగాడు.

"చాలు. కానీ జాగ్రత్తగా ఆడు ఒక్కోసారి నీ ఆట చూస్తే నాకు భయమేస్తుంది."

"అలాగే" అన్నాడు హనీఫ్.

మోటార్ సైకిల్ ఒక చిన్న పెంకుటింటి ముందు ఆగింది. పదేళ్ళముందు సత్యమూర్తి త్యాగరాయనగర్ బంగళాలో ఉండేటప్పుడు అతని కారు షెడ్ ఈ యింటికంటే పెద్దగా ఉండేది.

కానీ అందులో ఉన్నా. యిందులో ఉన్నా సత్యమూర్తి మాత్రం ఒకలాగే ఉన్నాడు.

ఈసరికి టీ, చార్మినార్ సిగరెట్లు, పేకతోబాటు సత్యమూర్తి సిద్ధంగా ఉంటాడు. అతడు వదులుకోలేకపోయిన వస్తువుల్లో మా పేకాట బల్లకూడా ఒకటి.

"మొన్న ఆంధ్ర మహాసభ దగ్గ గురువు కనిపించాడు. ఇంటికి తీసుకెళ్ళాను." అన్నాడు హనీఫ్ మోటార్ సైకిలుకు తాళంవేస్తూ.

"తర్వాత అంతా మామూలేనా?" నవ్వుతూ అడిగాను.

"ఆ.... బీబీగారి పోట్లాటతోకూడా."

"ఒరేయ్ ఏదో ఒకరోజు నువ్వు గురువును తాగుబోతుగా మార్చేస్తావురా." అన్నాను.

"నో, నో. గురువు దేనికీ అలా బానిసైపోడు. అతడు ఎప్పుడైనా పేకాటకు బానిసైపోయాడా?"

ఈ ప్రశ్నకు ఔననాలో, కాదనాలో నాకర్థం కాలేదు. కానీ ఒకటి మాత్రం నిజం. సత్యమూర్తి పేకాటలో కూడా కళాకారుడే!

ఔట్ డోర్ షూటింగ్‌కు వెళ్ళినప్పుడు, స్టుడియోలో విశ్రాంతి ఉన్నప్పుడు సత్యమూర్తి పేకాటక్కూర్చునేవాడు- ఆ ఆటకు రెండే నియమాలు.

పెద్ద "స్టేక్స్" ఆడకూడదు. ఎవరు గెల్చినా మిఠాయిలు కొని అందరికీ పంచాలి. సత్యమూర్తికి డబ్బు అచ్చుకోని నటుడు, అతడు పంచిన మిఠాయిలు తినని టెక్నీషియనూ మద్రాసు స్టుడియోల్లో ఆనాడు లేరని హనీఫ్ అంటుంటాడు.

మోటార్ సైకిలుకు తాళంవేసి. మా "ఆదివారం సంచీ" అందుకొని, గేటుగా అడ్డంపెట్టిన చెక్క సందులోంచి లోపలికెళ్ళాం.

"గురూ!" తలుపు తట్టాడు హనీఫ్.

తలుపు మామూలుగా తెరుచుకోలేదు.

"గురూ! ఇంకా నిద్ర పోతున్నావా? తలుపు తెరూ ....గురూ....గురూ."

పిలుపుకు తాళంవేస్తూ దబాదబాబాదాడు.

తలుపు తెరుచుకోలేదు.

ఆందోళనగా నావైపు చూశాడు హనీఫ్.

నాలోకూడా భయం నీడలా కదలసాగింది.

ఇద్దరం కలిసి దబదబా తలుపు బాదాం.

ప్రయోజనం లేకపోయింది. మా దెబ్బలకు అసలే బలహీనంగా ఉన్న తలుపు ఊగిపోయింది....

చుట్టుపక్కల యిళ్ళవాళ్ళు చేరారు. వాళ్ళందరికీ తలలో నాలుక సత్యమూర్తి. వాళ్ళ జీవితాల్లోని చిక్కుల్ని విడదీయటానికి సాయపడుతూ, వాళ్ళకు హోమియోపతి వైద్యంచేస్తూ వాళ్ళలో ఒకడుగాబతికాడు. అందరి కళ్ళల్లోనూ భయం. అనుమానం, సమాధానం లేని ప్రశ్నలు.

ఇంతలో యెవరో పెద్ద గునపం పట్టుకొచ్చారు.

హనీఫ్ దాన్నిలాక్కొని తలుపు సందులో యిరికించి, నెట్టటం ప్రారంభించాడు. వాడి కళ్ళు, కండలు పొంగాయే కాని తలుపు తెరుచుకోలేదు.

ఇద్దరు ముగ్గురు సాయంపట్టి నెట్టటం ప్రారంభించారు.

లోపలిగొళ్ళెం విరిగి దబాలున తలుపు తెరుచుకుంది!

తలుపుకు యెదురుగా వట్టిగూళ్ళ దండ వేలాడుతున్న పార్వతమ్మ ఫోటో.

ఫోటోకింద గాఢనిద్రలోసత్యమూర్తి.

## రసగుళిక

### పనికిరాని బిస్కట్లు - ఖర్చు 30 లక్షలు

"అత్యధిక శాతంలో పోషకపదార్థాలను కలిపి బిస్కట్లు తయారుచేయగలిగితే లక్షలు గడించవచ్చు"నన్న ఆలోచన కలిగింది స్వీడన్ దేశానికి చెందిన బిస్కట్ల కంపెనీ అధిపతికి. ప్రయోగాలు చేయడానికి కొత్త యంత్ర సామగ్రి కొనడానికి — తత్సంబంధంగా ఆ యజమానికి పది లక్షల దాకా ఖర్చయింది. విలువైన పోషక పదార్థాలతోనిండిన బిస్కట్లుతయారయాయి. సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ కేంద్రం అతనికి ఏడు లక్షలు సబ్సిడీగా ఇచ్చింది. ప్రజోపయోగమే తమ లక్ష్యంగా గల స్వీడన్ ప్రభుత్వంవారు కొత్తగా ఫ్యాక్టరీ భవన నిర్మాణానికి పది లక్షలు ఇచ్చారు. ప్రజలకు పోషక పదార్థాల సరఫరా జరుగుతుందన్న వుద్దేశంతో బిస్కట్ల ఫ్యాక్టరీని విస్తరింపచేయడానికి తమ నివాస స్థలాలను మార్చుకుంటారేమోనన్న భయంతో ఫ్యాక్టరీ చుట్టుపక్కలున్నవారు కోర్టులో దావా వేశారు. కోర్టు ఖర్చులకుగాను బిస్కట్ల ఫ్యాక్టరీ యజమానికి దాదాపు నాలుగు లక్షలు ఖర్చయింది.

ఇంతా చేసి తయారయిన బిస్కట్లను విడుదలచేసి చూస్తే ఆ బిస్కట్లు అమ్ముడుపోవటంలేదట. కారణం పోషక పదార్థాలు అధికంగా వున్నా ఆ బిస్కట్ల రుచి మాత్రం తినలేనంత ఘోరంగా వుందట.

- ఎన్. ఆంజనేయులు

For COLOUR FILMS AND JET SPEED COLOUR FILM PROCESSING AND PRINTING
MATHA STUDIOS
COLOUR LAB
Photographers & Dealers
ELURU ROAD.....VIJAYAWADA-520002
QUICK & QUALITY IS OUR MOTTO
WE ADD COLOUR & CHARACTER TO YOUR PICTURE



నెలకు రూ. 1,000/-లు సంపాదించండి

ఎలక్ట్రిక్ గైడ్ 10/-, ఫొటోగ్రఫీ టీచరి 10/-, ట్రాన్సిస్టర్ రేడియో గైడ్ 10/-, సెక్సు జీవితం బొమ్మలతో 10/-, మెడికల్ సెక్సు గైడ్ 10/-, డ్రాయింగ్ & పెయింటింగ్ 10/-, టైలరింగ్ & కటింగ్ 10/-, 300 కాటేజి ఇండస్ట్రీస్ గైడ్ 20-/. పోస్టేజి 1/50 అడ్వాన్సుగా పంపాలి.

ILFA BOOK DEPOT (A J)
B-25, Aligarh.

హనీఫ్ పెట్టుతిన్న బిడ్డ తల్లికోసం అరిచినట్టుగా "గురూ!" అని ముందుకు దూకాడు.

ప్రశాంతంగా మూసుకున్న కళ్ళు. ఆందోళన లేని ముఖం. కొద్దిగా తెరుచుకున్న నోరు. వికృతమైన గురక. నాకెంతో యిష్టమైన సత్యమూర్తి ముఖాన్ని చూస్తే భయమేసింది.

"భాయ్! గురువు...." హనీఫ్ యినుప పిడికిళ్ళు నా రెండు రెక్కలూ నలిపేస్తున్నాయి.

భయం భయంగా సత్యమూర్తి నుదుటి మీద చెయ్యిపెట్టి చూశాను.

"భయంలేదు.... గురువును తక్షణం ఆస్పత్రికి తీసుకెళ్ళాలి. నువ్వెళ్ళి టాక్సీ తీసుకురా," అన్నాను.

రెండో నిమిషం వీధిలో మోటార్ సైకిల్ గర్జించింది....

ఎంత తొందరపడ్డా కల్యాణ్ నర్సింగ్ హోమ్ చేరుకునేసరికి అరగంట పట్టింది. సూపరింటెండెంట్ బలరామయ్యగారు సత్యమూర్తికి చిరపరిచితులు. క్షణాలమీద పరీక్షలు ప్రారంభించారు. మమ్మల్నేమీ అడగలేదు, మేము చెప్పనూలేదు.

నేనూ, హనీఫ్ డాక్టర్ బలరామయ్యగారి గదిలో కూచున్నాము. వాడి సంగతి నేను చెప్పలేనుకానీ, నా గుండె చప్పుడు నాకే వినిపిస్తోంది.... పది నిమిషాల తరువాత బలరామయ్యగారు గదిలోకొచ్చారు. ఇద్దరం లేచి నిలబడ్డాం.

"ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించారు," అన్నారు.

"ఎవరు?" అన్నాడు హనీఫ్, అర్థం చేసుకోవటం యిష్టంలేక.

"ఇంకెవరు? సత్యమూర్తిగారు."

"ఎందుకూ?" మళ్ళీ ప్రశ్నించాడు.

"అది మీరు చెప్పాలి. ఎలా జరిగిందో నేను చెప్పగలను."

"ఎలా జరిగింది?" అన్నాను నేను.

"చాలా ఎక్కువగా నిద్ర మాత్రలు పుచ్చుకున్నారు. పుచ్చుకొని పన్నెండు గంటలు దాటిపోయింది." అన్నారు బలరామయ్యగారు.

గురువు ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించటమా?

అతడు పిల్లవాడూ కాదు-పిరికివాడూ కాడు.

ఎన్నోసార్లు కన్నీళ్ళతో చేతులు కడిగాడు. మరెన్నోసార్లు జీవితాన్ని ఒక ఊపు ఊపాడు.

కానీ జీవితాన్ని చూసి ఏనాడూ భయపడలేదు. తల వంచలేదు. అతడి ప్రాణానికి ప్రాణం పార్వతమ్మ చనిపోతే కంట్లో తడిపెట్టలేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న వృత్తి నేలమట్టమైపోతే బెదిరిపోలేదు.

తాను సంపాదించిన ఆస్తి కర్పూరంలా కరిగిపోతుంటే బాధపడలేదు.

సినిమా రంగంలో తాను మళ్ళీ నిలదొక్కుకోవడానికి తన చివరి పైసా వరకూ వెచ్చించి తీసిన సినిమా మట్టిపాలైపోతే ధైర్యం పోగొట్టుకోలేదు. తన సినిమా పోవటానికి వెనక పెద్ద కుట్ర వుందని తెలిసి కనీసం ఆశ్చర్యపోలేదు.

"ఈ వ్యవస్థే అలాంటిది. ఇప్పుడు సినిమా వ్యాపారం మాత్రమే. ఈ వ్యవస్థలో కళతోబాటు అన్నీ సరుకే" అని కారణంచెప్పి నవ్వగలిగాడు.

తన అన్నం తాను వండుకుంటూ, రెండు గదులు మాత్రమేవున్న పెంకుటింట్లో వుంటున్నా తల యెత్తుకొనే బ్రతికాడు.

ఎవరిముందూ చెయ్యి చాచలేదు.

హనీఫ్ లుంగీల మండీలో వుద్యోగం చెయ్యటానికి ఒప్పుకొని, వాళ్ళు తనకు పనిచెప్పి చేయించుకోవటం లేదని మానేశాడు.

"నీ చేత ఎలా పనిచేయించుకునేది గురూ?" అని హనీఫ్ అంటే,

"పని చెయ్యకుండా జీతం ఎలా తీసుకునేది?" అని జవాబు చెప్పాడు. తనని మరిచిపోలేని కొందరు తన సహాయార్థం నాటకాలువేసి డబ్బు సేకరిస్తామంటే—

"ఒంటరిగాణ్ణి నాకెందుకోయ్? నాకంటే ఎక్కువ బాధల్లో ఉన్నవాళ్ళ సంగతి ఆలోచించండి" అని నవ్వేశాడు.

తనవద్ద పెద్దపెద్ద సహాయాలు పొందిన వాళ్ళు చిన్నచిన్న సహాయాలు చెయ్యబోతే వాటినికూడా ఒప్పుకోలేదు.

"చూడు బాబూ, యిప్పుడు నాకవసరం లేదు. అవసరం వచ్చినప్పుడు నేనే తప్పక అడుగుతాను" అని తప్పించుకున్నాడు.

కానీ....

ఏనాడూ ఎవరి వద్దకూ వెళ్ళి తనకు వేషం యివ్వమని కూడా అడగలేదు....

అలాంటి సత్యమూర్తికి జీవితమంటే భయమా?

డాక్టరుగారు వెళ్ళిపోయారు....

సత్యమూర్తిని స్ట్రెచర్ మీద లోపలికి తీసుకెళ్ళారు.

నర్సింగ్ హోమ్‌లో హడావిడి ప్రారంభమైంది.

నేనూ, హనీఫ్ వరండాలో కొచ్చాం. స్ట్రెచర్‌మీద పడుకొనున్న సత్యమూర్తి ముఖం జ్ఞాపకం వస్తోంది. ఎంత ప్రశాంతంగా ఉన్నాడు సత్యమూర్తి-తన జీవితాన్ని తానే నలిపేసుకుంటూ, మా మనసుల్ని నలిపేస్తూ....


# B.E/B.Tech and M.B.B.S Entrance Coaching-1981

For all medical and Engineering Colleges including Andhra University

**OUR ACHIEVEMENTS IN 1980 :**

i. First Rank in MBBS Entrance Andhra Medical College, Vizag.
ii. 22 out of 82 Candidates got selected.
iii. 56 out of 220 candidates got selected for B.E/B. Tech.

Fee concession to SC/ST/Physically Handicapped Students Hostel facilities
available on reservation on or before 1-5-1981
Duration of coaching : 45 days
For details send Postal Stamps worth Re. 1

**C. K. HARANADHA RAO** B.Sc., M.Tech., M.I.A.E.' M.I.S.T.D., M.I.I.W., M.I.S.T.E., M.I.S.E.
DIRECTOR

**INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**

Near Saraswathi Theatre, Visakhapatnam - 20

## పహరా!

అంతా
లోకమంతా,
లోకమంతా
శోకమంతా,
శోకమంతా
శరీరమంతా నిద్రిస్తున్నప్పుడు,
నేను
మేలుకుని తిరగాలని వుంటుంది-

కడలి సమస్తం
కళ్ళు మూసుకుని కలలు కంటున్నప్పుడు
నేను, కదులుతున్న కెరటంలా
తలయెత్తి చూడాలని వుంటుంది,
నిద్రిస్తున్న నగరం పాపిటిలోంచి
కరెంటుతీగలా జలజలా పాకాలని వుంటుంది-

దిక్కులన్నీ నిద్రపోతున్న వేళ
ఒక్కడినే లేచివెళ్ళి
వెన్నెల గగనంలో
మబ్బు జెండాగా రెపరెపలాడాలని వుంటుంది-

ఒళ్ళంతా నిద్రపోతునా
కళ్ళకి కునుకు రానప్పుడు
నాలోపల నేనే
కవిత్వమై వర్షించాలని వుంటుంది-

పగలంతా రగిలిపోయి
చల్లగా విశ్రమిస్తున్న
పారలకీ, పలుగులకీ
కొడవళ్ళకీ, కన్నీళ్ళకీ
నిద్రాభంగం కాకుండా
విచ్చుకత్తులు పట్టుకుని
పహరా కాయాలని వుంటుంది!

—దేవీప్రియ

పొద్దు వాటారుతోంది. బయట ఉన్న అశోక చెట్లు వేడిగా నిట్టూరుస్తూ, దీనంగా మెల్లిగా కదులుతున్నాయి.

మేము అలాగే నిలుచున్నాం.

నా మనస్సులో ప్రశ్నలు, ప్రశ్నలు! వాటికి జవాబులు లేవు. సత్యమూర్తి నోరు తెరుచుకొనే ఉన్నా జవాబు చెప్పడు.

హనీఫ్ ముఖంలో భయాల నీడలు కదులుతున్నాయి.

"భాయ్, గురువుకు ప్రమాదంలేదు కదూ?" పెకలని గొంతుకతో అడిగాడు హనీఫ్.

అది ప్రశ్నలాలేదు. ప్రమాదం లేదని చెప్పమని కోరినట్టుగా వుంది.

"ఏం భయంలేదు," అన్నాను.

హనీఫ్ దీనంగా ఆకాశం వైపు చూశాడు. చీకటి మేలుకుంటోంది.

"ఒరేయ్, కాస్త ధైర్యంగా వుండు. గురువంటే బలరామయ్యగారి కెంత యిష్టమో నీకు తెలుసుగా. ప్రమాదం జరగనిస్తారా?" అన్నాను వాడి భుజం తడుతూ.

"ఏమో," అన్నాడు వాడు ముఖం తిప్పుకుంటూ....

సత్యమూర్తిని చూసి ఒకనాడు లక్షల గుండెలు రెపరెపలాడాయి.

ఈనాడు రెండే గుండెలు అతని కోసం కొట్టుకుంటున్నాయి.

ఇదెందుకో నాకు చాలా అసహజంగా కనిపిస్తోంది.

మేలుకున్న చీకటి పలచ పలచగా వ్యాపిస్తోంది. సూర్యకాంతి నేలమీదనుంచి పైకిపాకి అశోకచెట్ల చివళ్ళమీద మరింత ఉదారంగుతో మెరుస్తోంది....

బలరామయ్యగా రొచ్చారు.

ఇద్దరం త్వరత్వరగా వారికెదురెళ్ళాం.

"ఈ రెండు ఉత్తరాలూ సత్యమూర్తి గారి లాల్చీజేబులో వున్నాయి. ఇది మీకు. ఇది మీకు...." ఉత్తరాలు మా చేతుల్లో పెట్టారు.

నేనూ, హనీఫ్ ఒకేసారి వుత్తరాలు చింపాం.

"ప్రియమైన నేస్తం,

ఎవరికీ తన జీవితం తనకు బరువు కాదు. అంటే కాకూడదన్నమాట. కానీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒకరిబ్రతుకు బరువు మరొకరు మొయ్యకూడదు. అలా జరిగితే క్రమంగా అభిమానాలు చచ్చిపోయే ప్రమాదం ఉంది. అభిమానాలు చావటంకంటే మనం చావటమే మంచిది.

మొన్న నేనూ, హనీఫ్, నువ్వు ఏనాడూ పాల్గోని పార్టీ చేసుకున్నాం. అలాంటి సందర్భంలో మనవాణ్ణిచూస్తే 'ఒథెల్లో' నాటకంలో కాషియో జ్ఞాపకం వస్తాడు. వీళ్ళు తాగనూలేరు, తాగటం మాననూ లేరు. కానీ యిలాంటి వాళ్ళవల్ల కొన్ని లాభాలున్నాయి. తాగినప్పుడు నిజాలు దాచుకోలేరు. అలాంటి నిజం మొన్న హనీఫ్ చెప్పేశాడు.

రెండు విషయాల్లో నా సమర్థతమీద నాకు నమ్మకం వుండేది. మొదటి దినటన, రెండవది పేకాట. మొదటిది పరాయివాళ్ళ వల్ల పోయింది. రెండవది స్నేహితుల వల్ల పోయింది. పేకాట యెప్పుడూ నాకు వినోదం మాత్రమే. కానీ నాకు తెలియకుండానే నా వినోదం నాకు జీవనాధారంగా మారిపోయింది. ఇప్పుడు తెలుస్తోంది. అందుకు తప్పకుండా కారణం మీరే! ఏనాడూ పేకాటమీద ఆసక్తిలేని మీరు, గత మూడేళ్ళుగా యెందుకు శ్రద్ధ చూపిస్తూ వచ్చారో హనీఫ్ తనకు తెలీకుండా చెప్పే వరకూ నాకు ఎందుకు అర్థం కాలేదో ఆశ్చర్యంగా వుంది.

అది మీ స్నేహం నా వ్యక్తిత్వం మీద తీసిన దెబ్బ. మీరు యింతకాలంగా పద్ధతి ప్రకారం వాటాలు వేసుకొని పేకాటలో నాకిచ్చిన డబ్బు నేను ఎలా తీర్చుకునేది? ఇంతకాలమూ నేను అరువు బతుకు బతుకుతున్నానని తెలిసింది. అలాంటి బతుకు నా కిష్టం లేదు...."

"భాయ్." వెర్రిగా అరిచి హనీఫ్ నన్ను కౌగలించుకున్నాడు.

బలరామయ్యగారు ఏమీ అర్థం కాక వింతగా చూస్తున్నారు.

నా భుజం తడిసిపోసాగింది.

నా చెంపలూ తడిసిపోతున్నాయి.

"ఏమండీ.... ...." బలరామయ్యగారు యిద్దరి భుజాల మీదా చేతులు వేసి అన్నారు.

ఇంతలో లోపల్నుంచి ఒక జూనియర్ డాక్టర్ పరుగు పరుగున వచ్చి బలరామయ్యగారిని దగ్గరకు రమ్మని సైగ చేశాడు. చరచరా వెళ్ళారు బలరామయ్యగారు.

వారి మాటలు నాకు వినిపించడంలేదు. ఇద్దరి ముఖాలూ కనిపిస్తున్నాయి. వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో కూడా అర్థమౌతూనే ఉంది....

సూర్యుడు కృంగిపోయాడు. చీకటి దట్టంగా అల్లుకుంటోంది. అశోక చెట్లు చీకట్లో మాయమయ్యాయి.

హనీఫ్ వీపు నిమురుతూ మరొక చేత్తో నా కళ్ళు తుడుచుకోబోయాను.

కానీ వీలు కాలేదు.